క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు సంతోషి,తదితరులు

చీపురుపల్లి: స్థానిక వెంకటరమణ కళాశాల ఆవరణలో వాసవీ వనిత క్లబ్ ఉమెన్ ఎంపైర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని చీపురుపల్లి, గరివిడి పట్టణాలకు చెందిన వాసవీ వనిత క్లబ్ అధ్యక్షురాలు వజ్రపు సంతోషి శనివారం ప్రారంభించారు. ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు, విద్యార్థులు, పాదచారుల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేశామని చెప్పారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలుచోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా మని తెలిపారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సీఐ చంద్రశేఖర్, పోలీస్ సిబ్బంది

కొత్తవలస: మండలంలోని ముసిరాం గ్రామ సమీపంలోని సారా తయారీ శిబిరాలపై కొత్తవలస సీఐ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పోలీసులు అక్కడికి వస్తు న్నట్టు గుర్తించిన సారా తయారీదారులు అక్కడ నుంచి పరారయ్యారు. సారా తయారీకి ఉపయోగించే పాత్రలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్యులు

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస గ్రామంలో గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు అనీల్‌రామ్‌కుమార్‌రెడ్డి, కె.భారతి, ఎం.వి.వి.సత్యనారాయణ 240 మందికి సాధారణ, నేత్ర వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీపురుపల్లి: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి, గరివిడి పట్టణాలతో పాటు రావివలస, ఎం.దుగ్గివలస, మెరకముడిదాం మండలంలోని గరుగుబిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్టాపర్ల అందజేత



సీఐ చంద్రశేఖర్‌కు స్టాపర్లను అందజేస్తున్న శారద కర్మాగార ఉద్యోగులు

కొత్తవలస: రోడ్డు ప్రమాదాల నివారణకు తమవంతు సాయంగా కంటకాపల్లి సమీపంలోని శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కర్మాగార యాజమాన్యం రూ.1.80 లక్షల విలువైన స్టాపర్లను సమకూర్చింది. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వీటిని సీఐ ఎస్.చంద్రశేఖర్‌కు కర్మాగార యాజమాన్య సిబ్బంది శనివారం అందజేశారు. సీఐ మాట్లాడుతూ అరకు-విశాఖ,కొత్తవలస-విజయనగరం రోడ్లుల్లో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించామన్నారు. ఆయా ప్రదేశాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్లను పెడతామని తెలిపారు. శారద కర్మాగారం యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కర్మాగార హెచ్ఆర్ మేనేజర్ సన్యాసిరావు,జి.శంకరరావు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

దత్తిరాజేరు: విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శికారుగంజి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి అన్నారు. ఎనర్జీ క్లబ్ కార్యక్రమంలో భాగంగా శికారుగం, జి.రామచంద్రాపురం గ్రామాల్లో విద్యార్థులతో కలిసి శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

చెప్పింది చేసే అలవాటు చంద్రబాబుకు లేదు



పూలవర్షం కురిపిస్తూ ఊరేగింపుగా మంత్రి బొత్సకు స్వాగతం పలుకుతున్న మెట్టపల్లి గ్రామస్తులు

- అధికారం కోసం చంద్రబాబు మాయ మాటలు చెబుతాడు
- అధికారంలో ఉన్నప్పుడు ఆయనకు ప్రజలు గుర్తుకురారు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లి: ప్రజలకు కోసం ఇచ్చిన మాటను నెరవేర్చని చంద్రబాబు ఏదైనా ఇస్తానని చెబుతాడని, ఎందుకంటే చెప్పింది చేయడం చంద్రబాబుకు అలవాటు లేదని రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మెట్టపల్లి గ్రామంలో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామానికి వచ్చిన ఆయనకు మహిళలు, యువత ఘన స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ అధికారం కోసం అబద్ధాలు, మాయమాటలు చెప్పడం చంద్రబాబుకు అలవాటేనని అన్నారు. ఎన్నికలు వచ్చేసరికి టీడీపీ నాయకులు పచ్చ చొక్కాలు, కండు వాలు వేసుకుని పగటివేషగాళ్ల మాదిరిగా గ్రామాల్లోకి వచ్చి ఓట్లు అడుగుతారని, 2014 నుంచి 2019 వరకు టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు ఈ ప్రాంతంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని టీడీపీ నాయకులను నిలదీయాలని ప్రజలకు సూచించారు.

పరిపాలనలో విప్లవాత్మక మార్పులు

నిస్వార్థంగా,నిజాయితీ ప్రజలకు సేవలందించిన వలంటీర్లపై అనుచితంగా మాట్లాడడమే కాకుండా, ఎన్నికల కమిషన్‌కు తన మనుషులు ద్వారా చంద్రబాబు ఫిర్యాదు చేశారని మంత్రి బొత్స ఆరోపించారు. చంద్రబాబు చేసిన పాపపు పనివల్ల పింఛన్ కోసం వృద్ధులు, దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తే తప్ప ఎలాంటి పథకం వచ్చేది కాదన్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేసినా వేయకపోయినా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందజేశారని చెప్పారు. పరిపాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని చెప్పారు.పిల్లల చదువు కోసం తల్లిదండ్రులపై ఎలాంటి భారం లేకుండా మొత్తం ప్రభుత్వమే చూసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేస్తూ పేదింటి పిల్లలు ప్రపంచంతోనే పోటీ పడేందుకు అవసరమైన పునాదిని వేస్తున్నట్లు చెప్పారు. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశామని ధైర్యంగా చెప్పగలమని, టీడీపీ నేతలు అలా చెప్పగలరాని ప్రశ్నించారు. ప్రజలకు ఎంతో మేలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని, ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి మద్దతు ఇవ్వాలని కోరారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో 600 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన చంద్రబాబు మళ్లీ ఆరు గ్యారెంటీల పేరుతో మభ్య పెట్టేందుకు చూస్తున్నారని, ఎవ్వరూ నమ్మొద్దని కోరారు. టీడీపీ పరిపాలనలో ఎందుకు ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ప్రశ్నించారు. సంక్షేమ పరిపాలన కొనసాగాలంటే మళ్లీ జగన్‌ని ముఖ్యమంత్రి చేసుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర డిప్యూటీ కో-ఆర్డినేటర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2014లో ఇంటికో ఉద్యోగం ఇస్తామని, డ్వాక్రా రుణమాఫీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, ఆ హామీలను అమలు చేశాడా అని ప్రశ్నించారు. ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమన్నారు. టీడీపీ నుంచి పోటీ చేసేందుకు అభ్యర్థులు ఎక్కెడక్కడి నుంచో వస్తున్నారని, మే 13న పోలింగ్ ముగిసాక వారు ఎక్కడుంటారో వారికే తెలియదన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా తాము నిరంతరం ప్రజలతోనే ఉన్నామని, ఉంటామని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు...

మెట్టపల్లి గ్రామానికి చెందిన గూనాన పైడితల్లి, పిసిని గురునాయుడు, గూనాన ఈశ్వరరావు, లంకలపల్లి వాసుదేవరావు, ముల్లు అప్పలనాయుడు కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, ఎంపీటీసీ మీసాల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న మంత్రి బొత్స

సంక్షేమం.. అభివృద్ధికి కేరాఫ్ సీఎం జగన్



గాంధీనగరంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి

కొత్తవలస: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరు చెబితే సంక్షేమం, అభివృద్ధే గుర్తుకువస్తుందని, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పేరు చెబితే మోసం, వంచన, కరువు, కాటకాలు గుర్తుకువస్తాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉత్తరాపల్లి సచివాలయం పరిధి ఉత్తరాపల్లి, గాంధీనగరం, చిన్నిపాలెం గ్రామాల్లో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబుతో కలిసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు ఎమ్మెల్యే,నాయకులకు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పార్టీలతో సంబంధం లేకుండా,సిఫార్సులతో పని లేకుండా అర్హులకు పారదర్శకంగా పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, ఆమె మామ అప్పలనాయుడు తొమ్మిది పర్యాయాలు ఇక్కడ ఎమ్మెల్యేలుగా పని చేశారని, గ్రామాల్లో కనీస మౌలిక సదు పాయాలు కల్పించలేకపోయారని విమర్శించారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో కోట్ల రూపాయలతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువలు, కమ్యూనిటీ భవనాలు, సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల భవనాలను నిర్మించామని చెప్పారు. సీఎం జగన్ చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లి పార్టీని విజయశిఖరాలపై నిలపాల్సిన బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు.



ఉత్తరాపల్లిలో ఎమ్మెల్యే కడుబండికి హారతి ఇచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని, ఎస్.కోట ఎమ్మెల్యేగా పోటీచేస్తున్న తనను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఎంపీపీ ఎస్.గోపమ్మ, జెడ్పీటీసీ నెక్కల శ్రీదేవి, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, వైస్ ఎంపీపీ కర్రి శ్రీను,మండల జేసీఎస్ ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బి నాయుడు, ఉత్తరాపల్లి, చిన్నిపాలెం గ్రామాల సర్పంచ్‌లు సింగంపల్లి వెంకటలక్ష్మి, ఆర్.పద్మలత, ఎంపీటీసీ మూనూరు శివప్రసాద్, చిన్నిపాలెం వైస్ సర్పంచ్ వనుం వెంకటరావు,నాయకులు సింగంపల్లి గణేష్, మేలాస్త్రి అప్పారావు, లగుడు ఓమాలు, పల్లా భీష్మ, శ్రావణ్‌కుమార్, మదీన అప్పలరామణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు



బొండపల్లి: వేంద్రాంలో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు



మెరకముడిదాం: కొత్తకర్ర గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న బుధరాయవలస ఎస్ఐ లోకేశ్వరరావు

బొండపల్లి: ఎన్నికల కోడ్‌ను ప్రతి ఒక్కరూ పాటించాలని, నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ కె.లక్ష్మణ రావు అన్నారు. మండలంలోని వేంద్రాం గ్రామస్తులకు ఎన్నికల నిబంధనలపై శనివారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ అనవసర తగాదాల్లో తలదూర్చి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. పోలీస్ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

మెరకముడిదాం: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలంతా సహకరించాలని బుధరాయవలస ఎస్ఐ బి. లోకేశ్వరరావు కోరారు. మండలంలోని కొత్తకర్ర గ్రామంలో ప్రజలకు ఎన్నికల నిబంధనలపై శుక్రవారం రాత్రి అవగాహన కల్పించా రు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ఎవరైనా గొడవలు, కొట్లాటలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గొడవలకు దిగిన వారిపై బైండోవర్ కేసులతో పాటు, అవసరమైతే రౌడీషీట్ కూడా తెరుస్తామని చెప్పారు. పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి

బొండపల్లి: సచివాలయాల్లో రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు సచివాలయ ఉద్యోగులకు సూచించారు. మండలంలోని గరుడుబిల్లి గ్రామ సచివాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు.రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామా ల్లో ఇంకా ఎవరైనా పింఛన్ తీసుకోని వారు ఉంటే గుర్తించి, వారందరికీ పింఛన్ అందజేయాలని చెప్పారు. ఉపాధి పనులను పంచాయతీ కార్యదర్శులు పరిశీలించాలని సూచించారు. ఆయన వెంట మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ దత్తి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కె.ఎర్రినాయు డు తదితరులు ఉన్నారు.



సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి గ్రామంలో విద్యుత్ లోఓల్టేజీ సమస్యకు సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపారు. గ్రామంలో సుమారు 650 గృహాలు ఉన్నాయి. గతంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు ఉండేవి. తరచూ లోఓల్టేజీ సమస్య కారణంగా ఇళ్లలోని ఫ్యాన్లు, లైట్లు, ఇతర విద్యుత్ ఉపకరణాలు సరిగా పనిచేయక వినియోగదారులు అవస్థలు పడేవారు. మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో తాగునీటికి కూడా ఇబ్బందులు పడాల్సి వచ్చేది. సమస్యను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు పిల్ల అప్పలనాయుడు, జమ్ము మహేష్, తదితరులు రాష్ట్ర విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. వారు స్పందించి 40కేవీ, 110కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించారు. గ్రామంలోని యాతపేట, గొల్లలపేట ప్రాంతాల్లో అధికారులు వాటిని ఇటీవల ఏర్పాటు చేశారు. దీంతో లోఓల్టేజీ సమస్య పూర్తిగా పరిష్కారమైందని గ్రామస్తులు అంటున్నారు. ఈ ఐదేళ్లలో గ్రామంలో కొత్తగా 30 వ్యవసాయ బోర్ల కనెక్షన్‌లు మంజూరు చేశారు. గతంలో 25 వ్యవసాయ బోరు కనెక్షన్లు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 30కి చేరింది. కొత్త కనెక్షన్ల మంజూరుతో రైతులకు మేలు జరిగింది.



తోండ్రంగిలో ఏర్పాటు చేసిన 110 కేవీ ట్రాన్స్‌ఫార్మర్

మండల సర్వ సభ్యసమావేశం

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ డి.సత్యవంతుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అభివృద్ధి పనులు, సమస్యలపై ఎలాంటి చర్చ జరగలేదని ఎంపీడీఓ కె.నిశ్చల తెలిపారు. సమావేశానికి హాజరైన సభ్యులు సంతకాలు చేసి వెనుదిరిగారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

బొండపల్లి: మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఎస్ఐ కె.లక్ష్మణరావు సూచించారు. స్థానిక జాతీయ రహదారి-26పై పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం ఆయన వాహన తనిఖీలు నిర్వహించడంతో పాటు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలకు చాలా వరకు మైనర్లే కారణమన్నారు. మైనర్లు ద్విచక్ర వాహనాలను ఇష్టారీతిగా నడపడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ లక్ష్మణరావు

చంద్రబాబు బృందాన్ని నమ్మవద్దు



ఎం.లింగాలవలలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య, నాయకులు

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: ఎన్నికలు వస్తేనే టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆయన బృందానికి ప్రజలు గుర్తుకువస్తారని, గ్రామాల్లోకి వచ్చి ఓట్ల కోసం బూటకపు హామీలు ఇచ్చే చంద్రబాబు బృందాన్ని నమ్మి మోసపోవద్దని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ప్రజలకు సూచించారు. మండ లంలోని ఎం.లింగాలవలస, గడసాం గ్రామాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన సభల్లో ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 99 శాతం అమలు చేశారన్నారు. పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందించామని చెప్పారు. నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశామన్నారు. గజపతినగరం నుంచి గడసాం మీదుగా పోరలి వరకు రూ. 40 కోట్లతో డబుల్‌లైన్ రోడ్డు వేశామని, దత్తిరాజేరు మండలం మీదుగా ఉన్న విజయనగరం- సాలూరు ఎన్‌హెచ్-26 విస్తరణ పనులను రూ.150 కోట్లతో చేపట్టామని వివరించారు. మరడాం వద్ద గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. అనేక గ్రామాలకు నూతనంగా తారురోడ్లను నిర్మించడం తో పాటు శిథిలమైన రోడ్లను పునరుద్ధరించామని, గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించామని పేర్కొన్నారు. నాడు- నేడులో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేశామని చెప్పారు.



గడసాంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

అవినీతి రహిత పాలన

ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అవినీతి రహిత, సంక్షేమ పాలన జరిగిందని అన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం పరితపించే జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా కొనసాగాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజలంతా ఆయన్ని ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గజపతినగరం ఎమ్మెల్యేగా బొత్స అప్పలనరసయ్యను, విజయనగరం ఎంపీగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య కుమారుడు గురునాయుడు, ఎం.లింగాలవలస, గడసాం సర్పంచ్‌లు మజ్జి రామలక్ష్మి, నేతేటి దీపిక, ఎంపీటీసీలు అలజంగి అప్పలనాయుడు, బూడి చిన్నమ్మి, ఉప సర్పంచ్ మజ్జి ఈశ్వరరావు, నాయకులు మజ్జి అప్పలనాయుడు, నేతేటి వెంకటరమణ, బూడి గణపతి, మజ్జి శ్రీను, సుంకరి శివ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు తరలింపునకు ఉత్తర్వులు జారీ



జిల్లా న్యాయమూర్తి నుంచి ఉత్తర్వుల ప్రతిని అందుకుంటున్న ఎస్.కోట బార్ అసోసియేషన్ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కోర్టును వేరే భవనాల్లోకి తరలించేందుకు ఎట్టకేలకు హైకోర్టు నుంచి అనుమతులు వచ్చాయి. ఇటీవల ఎన్నికైన ఎస్.కోట బార్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులుజి.సూరిదేముడు,బి.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణచక్రవర్తిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. వీరికి న్యాయమూర్తి శుభాకాంక్షలు తెలిపారు. జడ్జి మాట్లాడుతూ ఎస్.కోట కోర్టును తాత్కాలికంగా అద్దె ప్రాతిపదికన సాయికృష్ణ కల్యాణ మండపంలోకి మార్చేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. అందుకు సంబంధించిన ఉత్తర్వుల ప్రతిని ఎస్.కోట బార్ అధ్యక్షుడు సూరిదేముడుకు అందజేశారు. జిల్లా న్యాయమూర్తిని కలిసిన వారిలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఎల్.అప్పారావు, బి.త్రిమూర్తులు, డబ్ల్యూ.ఎస్.శర్మ, అల్లు సత్యాజీ, న్యాయవాదులు ఎన్.టి.వి.దాసు,జి.ప్రకాశ్, టి.వి.ఆర్.మూర్తి, బి.రామ కృష్ణ, బి.వి.ఎస్.రామారావు, ఎన్. సత్యనారాయణ, ముత్యాలనాయుడు ఉన్నారు.

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు

జామి: భీమసింగిసుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం విశేష పూజలు చేశారు.స్వామివారిని వివిధ ప్రత్యేకంగా అలంకరించారు.భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి



గంట్యాడ: పెదవేమలిలో కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్న జైహింద్‌కుమార్, జెడ్పీటీసీ నరసింహమూర్తి



బొండపల్లి: వెదురువాడలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు



దత్తిరాజేరు: ఎస్.భూర్జవలసలో యువకులతో సమావేశమైన వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు చిరంజీవి

గంట్యాడ: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ కోరారు. బుడతానపల్లి, కితుబర్తి, చంద్రంపేట, పెదవేమలి గ్రామాల్లో శనివారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికీ వివరించా లని సూచించారు. గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స అప్పలనరసయ్యను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులకు శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, ఎంపీటీసీ పాటుపురెడ్డి భవాని, సర్పంచ్ వర్రి పాపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లండి..

బొండపల్లి: గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చిన తర్వాత చేసిన అభివృద్ధిని వివరించాలని ఎంపీపీ చల్లా చలం నాయుడు సూచించారు. మండ లంలోని వెదురువాడ,జె.గుమడాం, కొత్తపాలెం గ్రామాల్లోని నాయకులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. రానున్న 35 రోజులు చాలా కీలకమని గ్రామాల్లో ఇంటింట ప్రచారం చేయాలని సూచించారు. జెడ్పీటీసీ సభ్యులు రాపాక సూర్యప్రకాశరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొద్దల చిన్నంనాయుడు, నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, మండల జేసీఎస్ కన్వీనర్ పల్లి రఘు, నాయకులు ఎం.వెంకిరాజు, ఎం.రామ్మూర్తి,మంత్రి గోవిందరావు,సాలాపు పెంటం నాయుడు,వేమలి వెంకటరావు పలువురు సర్పంచ్‌లు,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రతి ఓటరుకూ వివరించండి

దత్తిరాజేరు: ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమంతో పాటు పరిపాలనలో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకు వచ్చిన సంస్కరణలను ప్రతి ఓటరుకూ వివ రించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులకు ఆ పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి సూచించారు. మేమంతా సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఎస్. భూర్జ వలసలో యువతతో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో ప్రతి కుటుంబానికీ ఏదో ఒక మేలు జరిగిందన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయించి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స అప్పలనరసయ్య, విజయనగరం ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.